# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-03-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ప్రజలు ఈ రోజు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నారు.**

**2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఉగాది ఉత్సవాల్లో పాల్గొననున్నారు.**

**3. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ లో చెరువులను పునరుద్ధరిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

**4. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

==========================

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ప్రజలు ఈరోజు శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నారు. కొంగొత్త ఆకాంక్షలతో శ్రీ పరాభవ సంవత్సరానికి తెలుగు ప్రజలు స్వాగతం పలుకుతూ ఈ పర్వదినాన్ని సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నారు. చైత్ర మాసం శుక్లపక్షంలో వచ్చే శుద్ధ పాడ్యమి నాడు ఉగాది పండుగ జరుపుకోవడం మన ఆనవాయితీ. పవిత్రమైన ఈ రోజు నుంచే వసంత ఋతువు ఆరంభమవుతుంది. షడ్రుచుల సమ్మేళనంతో కూడిన ఉగాది పచ్చడిని స్వీకరించడం ఈ పండుగ ప్రత్యేకత. జీవితంలో ఎదురయ్యే కష్ట సుఖాలను సవాళ్ళను సమానంగా స్వీకరించాలని ఉగాది పచ్చడి సందేశం ఇస్తుంది. బెల్లం, ఉప్పు, చింతపండు, వేప పువ్వు, పులుపు, కారం వంటి షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసే ఉగాది పచ్చడి మన శరీరానికి ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేకూరుస్తుందని ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని భారతీయ సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానం సూచిస్తోంది.

--------------------------

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు పురస్కారాలను ఈరోజు విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా అందజేయనుంది. ఇందులో భాగంగా మొత్తం 164 మందిని పురస్కారాలకు ఎంపిక చేసింది. ప్రతిష్టాత్మకమైన 'కళారత్న' అవార్డులకు 40 మందిని ఎంపిక చేయగా, 'ఉగాది విశిష్ట పురస్కారాల'కు వివిధ రంగాలకు చెందిన మరో 124 మందిని ఎంపిక చేసింది. సాహిత్యం విభాగంలో గతంలో ఆకాశవాణిలో పని చేసిన ఆర్.ఎ. పద్మనాభం, రొక్కం కామేశ్వరరావు, కళారత్న అవార్డులను జర్నలిజం విభాగంలో జి. కొండలరావు, వలేటి గోపిచంద్ లతో పాటు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో ప్రస్తుతం కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు

నిర్వర్తిస్తున్న చుండూరు మాణిక్య రావులు ఉగాది పురస్కారాలు అందుకోనున్నారు.

-------------------------

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. శాసనసభలో ఆయన నిన్న మాట్లాడారు. దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాల్లోని పరిస్థితులు కనువిప్పు కావాలన్నారు. చెరువులను కబ్జాల చెర నుంచి విడిపించి పునరుజ్జీవనం చేస్తున్నామని, బతుకమ్మకుంట, నల్లచెరువు, బుమ్‌రుఖ్‌ఉద్దౌలా చెరువులను పునరుద్ధరిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

-------------------------

రాష్ట్ర ప్రభుత్వం పతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 ను ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా ఉద్యమ స్థాయికి తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులతో ఈ అంశంపై ఆయన నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. పీ4 కార్యక్రమం ప్రారంభించి ఈనెల 30వ తేదీకి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. తొలి ఏడాదిలో ఇప్పటి వరకూ రెండున్నర లక్షల మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపామని, బంగారు కుటుంబాలకు చేయూతను ఇవ్వటంలో ఆదర్శంగా నిలిచిన మార్గదర్శులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగించేలా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

-------------------------

పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులు సమావేశం అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్వాసితులకు మూడు విడతలుగా 19 వందల 40 కోట్ల రూపాయలు అందించిందని తెలిపారు. నిర్వాసితుల ఇళ్ల నిర్మాణానికి 3 లక్షల 57వేల రూపాయల చొప్పున ఇస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేస్తూ...

వాయిస్.. 30 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం రైల్వే జోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభం కానున్నాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖపట్నం రైల్వే జోన్ ఆయన నిన్న పార్లమెంట్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇప్పటికే జనరల్ మేనేజర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం నిర్మాణానికి అవసరమైన పునాది పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. అదేవిధంగా ఎర్రుపాలెం--అమరావతి--నంబూరు రైల్వే లైన్ నిర్మాణానికి 2 వేల 47 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 70 వేల 232 కోట్ల వ్యయంతో వివిధ రైల్వే ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

-------------------------

గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లకు డబ్బులు చెల్లించి, ఫ్లాట్ కేటాయింపులు జరగని వారికి వారి దరఖాస్తు రుసుము తిరిగి చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆయన నిన్న తన క్యాంపు కార్యాలయంలో పట్టణాభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లను లబ్దిదారులకు అందించి గృహ ప్రవేశాలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో (యూఎల్బీ) ప్రతీ ఇంటికి క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ డోర్ నెంబర్లు త్వరితగతిన కేటాయించాలని ముఖ్యమంత్రి అన్నారు. ఆస్తి పన్ను మొదలుకొని అన్ని వివరాలు క్యూఆర్ కోడ్‌తో లింక్ చేయాలని అధికారులకు సూచించారు.

------------------------

తెలుగు రాష్ట్రాల్లో జరుపుకునే ఉగాది పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వసంతకాలం ప్రారంభంలో జరుపుకునే ఈ పండుగ తెలుగు నూతన సంవత్సర ప్రారంభానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆశ, ఉత్సాహాలతో ముడిపడి ఉన్న ప్రత్యేక పండుగ ఉగాది అని తెలిపారు. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని, శ్రేయస్సును, విజయాలను తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

---------------------------

గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి దక్షిణ అంతర కర్ణాటక వరకు తమిళనాడు అంతర్భాగంగా సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో అల్పపీడన ద్రోణి విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు వెల్లడిస్తూ...

వాయిస్.. 25 సెకన్లు

మరో వైపు తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ లోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత ఇళ్లను వచ్చే ఏప్రిల్, మే నెలలో ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

========================